మేడ్చల్‌ వైపు మెట్రో లేనట్టేనా..?

నేడు కరెంట్‌ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌: అత్వెల్లి సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్‌ పరిధిలోని ఫీడర్లలో నేడు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈ మౌలాలి తెలిపారు. 11కేవీ స్పిక్‌ ఫీడర్‌ పరిధిలోని రేకులబావి, టైటాన్‌ కంపెనీ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, 11కెవి తండా ఫీడర్‌ పరిధిలోని సైదనిగడ్డంతడా, మామిడి తండా, జయదర్శిని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు పవర్‌ కట్‌...

పోచారం: నారపల్లిలోని 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున శనివారం విద్యుత్‌ సరఫరా అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు వెంకటాద్రి టౌన్‌షిప్‌, చౌదరిగూడ, విజయపురి కాలనీ, శివాజీనగర్‌, ఓయూ కాలనీలకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఒకటిన్నర వరకు అన్నోజిగూడ, ఎల్‌ఎన్‌ కాలనీ, సద్భావన టౌన్‌షిప్‌, పోచారం, బొక్కాయిగూడ, బాబానగర్‌, యంనంపేట్‌, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఎన్‌ఎఫ్‌సీ నగర్‌, జైపురికాలనీలకు, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి 2 గంటల వరకు అన్నోజిగూడ, ఎల్‌ఎన్‌ కాలనీ, ఎల్‌ఐజీ, జైపురి కాలనీ, సత్యానగర్‌, సాయినగర్‌, ఇందిరానగర్‌ ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట శుక్రవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పాల్గొన్న జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి సంతోష్‌రాథోడ్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం 8.300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు బకాయిలుగా ఉందని వాటిని విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు కార్పొరేట్‌ యాజమాన్యాలకు సర్టిఫికెట్ల కోసం స్వంతంగా డబ్బులు కట్టాల్సి వస్తుందన్నారు.పేద విద్యార్థులకు వరంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కిరణ్‌, ప్రసాద్‌, రవికుమార్‌, శ్రీకాంత్‌, శ్రీను, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు


ప్రశంస పత్రాలతో విద్యార్థులు

మేడ్చల్‌: జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని యూనివర్సల్‌ 369 అకాడమీలో కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో 150మంది విద్యార్థులు పాల్గొని కరాటే ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్‌ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ జిల్లా సెక్రటరీ కృష్ణయ్య, పీడీ ప్రసన్నకుమారి, అకాడమీ చైర్మన్‌ సాయికుమార్‌, మాస్టర్లు రాజు యాదవ్‌, విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్‌ బాలాజీ హిల్స్‌ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్‌: ఈస్ట్‌ బాలాజీ హిల్స్‌ కాలనీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ చైర్మన్‌గా వెలుగొండయ్య, అధ్యక్షుడిగా చంద్రంగౌడ్‌, ప్రధాన కార్యదర్శిగా రఘునాయక్‌, కోశాధికారిగా అంజయ్యగౌడ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా జగన్‌రావు, కమిటీ సభ్యులుగా నారాయణ, వెంకట్‌, వేణు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు మేయర్‌ అజయ్‌యాదవ్‌ను కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, భూక్యా సుమన్‌ నాయక్‌ను కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.


ఐదో రోజూ గ్రూప్‌-1 మెయిన్స్‌ ప్రశాంతం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని రెండు సెంటర్లలో ఐదోరోజూ గ్రూప్‌-1 మెయిన్స్‌ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1394 మంది అభ్యర్థులకు 917 మంది హాజరు కాగా, సెంటర్‌-1 లో 131 మంది, సెంటర్‌-2లో 346 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగ అభ్యర్థుల్లో 136 మందికి 93 మంది హాజరుకాగా, సెంటర్‌-1లో ఏడుగురు, సెంటర్‌-2లో 26 మంది పరీక్షకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్‌: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌ 5, 17వ డివిజన్లలో రూ 66.50 లక్షల వ్యయంతో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏడో డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్‌ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్‌ నియోజకవర్గ బీ బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌ నేతలు హరినాథ్‌రెడ్డి, విశ్వంగుప్తా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


షేక్‌ సాక్లైన్‌ మృతదేహం

శామీర్‌పేట్‌: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శామీర్‌పేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన షేక్‌ సాక్లైన్‌(22) మిత్రుడితో కలిసి బైక్‌పై కరీంనగర్‌ నుంచి నగరంలోని మెహదీపట్నానికి బయలుదేరాడు. గురువారం రాత్రి శామీర్‌పేట్‌ ఓఆర్‌ఆర్‌ సమీపంలో వీరు ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేస్తున్న క్రమంలో బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో షేక్‌ సాక్లైన్‌ ఆర్టీసీ బస్సు కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. శామీర్‌పేట్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌ వైపు మెట్రో లేనట్టేనా..?

రెండో దశలో కనిపించని మేడ్చల్‌ పేరు

ఆయా ప్రాంతాల ప్రజలకు మొండిచేయి



మేడ్చల్‌: సికింద్రాబాద్‌ ప్యారడైజ్‌ నుంచి కండ్లకోయ ఔటర్‌ రింగురోడ్డు జంక్షన్‌ వరకు 44వ జాతీయ రహదారిపై డబుల్‌ డెక్కర్‌ ఫ్లైఓవర్‌లు నిర్మించి మెట్రో రైల్‌ సేవలు ఏర్పాటు చేస్తామని పాలకులు చెప్పిన మాటలు కేవలం నీటిమూటలుగానే మిగిలిపోయాయి. హైదరాబాద్‌ నగరంలో విలీనం అవుతున్న మేడ్చల్‌ వైపు ప్రాంతాల ప్రజలకు మెట్రో రైలు మోక్షం కలగడం లేదు. హైదరాబాద్‌లో రెండవ దశ మెట్రో విస్తరణ భాగంగా పటాన్‌ చెరువు, శంషాబాద్‌ వైపు 80 స్టేషన్‌లతో 116 కిలోమీటర్ల మేర మెట్రో రైల్‌ సేవలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించినా మేడ్చల్‌ పేరు మాత్రం లేకుండా పోయింది. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో నాటి మున్సిపల్‌ శాఖ మంత్రి కేటీఆర్‌ సికింద్రాబాద్‌ ప్యారడైజ్‌ నుంచి మేడ్చల్‌ పరిధిలోని కండ్లకోయ ఔటర్‌ రింగు రోడ్డు జంక్షన్‌ వరకు డబుల్‌ డెక్కర్‌ ఫ్లైఓవర్‌లు నిర్మించి మెట్రో సౌకర్యం కలిపిస్తామని ప్రకటించారు. తాజాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం మెట్రో విస్తరణలో మేడ్చల్‌కు మొండిచేయి చూపింది.

విస్తరిస్తున్న మేడ్చల్‌ రూట్‌..

సికింద్రాబాద్‌కు కేవలం 25 కిలో మీటర్ల దూరంలో మేడ్చల్‌ ఉంది. ఈ రూట్‌లో సుచిత్ర, కొంపల్లి, జీడిమెట్ల వంటి ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రూట్‌లో వందల కొద్ది కాలనీలు, పరిశ్రమలు, వివిధ రకాల సంస్థలు వేల సంఖ్యలో పని చేసే వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు, దాదాపు 30 వేల వరకు విద్యార్థులు వివిధ రకాల విద్యాసంస్థల్లో చదువుతున్నారు. గేటెడ్‌ కమ్యూనిటీలు, విల్లాలు, మల్టీప్లెక్స్‌లు, షాపింగ్‌ మాల్స్‌ ఇలా మేడ్చల్‌ రూట్‌ సుచిత్ర నుంచి మేడ్చల్‌ వరకు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతూనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు.

మేడ్చల్‌ వైపు ఎందుకు రావడం లేదు..

నగరం చుట్టూ ఉన్నా మిగతా ప్రాంతాలతో పోల్చి చూస్తే మేడ్చల్‌ వైపు ఓ అంతార్జాతీయ ఎయిర్‌పోర్ట్‌ లేదన్న మాటే గాని మిగతా విషయాల్లో మిగతా ప్రాంతాల కంటే మెరుగ్గా ఉంది. ఇంటర్నేషనల్‌ స్కూల్స్‌, పేరుగాంచిన కళాశాలలు, వైద్య కళాశాలలు, ఇంజనీరింగ్‌ కళాశాలలు, ఉపాధి కలిపించే పరిశ్రమలు, స్పీడు మీద ఉన్న రియల్‌ ఎస్టేట్‌ రంగం వంటి ఎన్నో అంశాల్లో మేడ్చల్‌ ముందుంది. ప్రజల నివాసంకు ఎంతో అనువుగా ఉన్న మేడ్చల్‌ ప్రాంతంకు మెట్రో సేవలు లేకపోవడం ఆలోచించదగ్గ విషయమే. మేడ్చల్‌ ప్రాంతంలో పెద్ద రాజకీయ నాయకులు లేకపోవడం, అధికార పార్టీ కంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఉండటం మైనస్‌గా మారింది. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో మేడ్చల్‌ వైపు పెద్ద ప్రాజెక్టులు రాకపోవడం, తీసుకవచ్చేవారు కరువు అవడంతో ప్రాంతంను పట్టించుకునే వారు లేకుండా పోయారు.

మూడు గంటల ప్రయాణం..

నగరంకు మేడ్చల్‌ నుంచి చేరుకోవాలంటే మూడు గంటల ప్రయాణ సమయం పడుతుంది. జాతీయ రహదారి విస్తరణ, విపరీతమైన రద్దీతో గంటసేపు ప్రయాణం చేయాల్సిన రూట్‌ మూడు గంటలు పడుతోంది. దీంతో నగరంకు వెళ్లే వారికి, నగరం నుంచి మేడ్చల్‌ వైపు వచ్చే వారికి రవాణ సౌకర్యం మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మెరుగైన రవాణా సౌకర్యం మెట్రోతోనే సాధ్యం కావడంతో మేడ్చల్‌ ప్రజలు మెట్రో కోసం కోటి ఆశలతో ఎదురు చూసినా రెండవ దశలో ఫలితం శూన్యంగా కనిపిస్తోంది.

సీఎం ప్రజల రుణం తీర్చుకోవాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌ ఎమ్మెల్యేగా ఓడిపోయిన సమయంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ పరిధిలో ఉండే మేడ్చల్‌ రూట్‌ ప్రాంత ప్రజలు ఎంపీగా గెలిపించినప్పటికీ ఆయన మేడ్చల్‌ను పట్టించుకోవడం లేదు. రాజకీయంగా నిలబెట్టిన మేడ్చల్‌కు మెట్రో రైలు పొడగించి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోవాలి. మేడ్చల్‌ రూట్‌ నగరం శివార్లలో విపరీతంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో మెట్రో సేవలు ఇక్కడి ప్రజలకు కలిపించాలి.

– రవీందర్‌రెడ్డి, మేడ్చల్‌ కాంగ్రెస్‌ నాయకుడు

మేడ్చల్‌ రూట్‌లో మెట్రో అవసరం



మేడ్చల్‌ రూట్‌ నగరంకు చేరువలో ఉండటంతో ఇక్కడి ప్రజలకు మెట్రో రైలు ఎంతో అవసరం. వేలమంది నిత్యం ఈ రూట్‌ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం మెట్రో ఏర్పాటు చేయాల్సిందే. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, తాజాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం శివారు ప్రాంతాల ప్రజలను మోసం చేస్తున్నాయి.

– మల్లికార్జున్‌ ముదిరాజ్‌, కౌన్సిలర్‌ గుండ్లపోచంపల్లి

27న కీసరలో బోనాల ఉత్సవాలు


బోనాల ఉత్సవాలకు ముస్తాబైన బంగారు మైసమ్మ ఆలయం

కీసర: ఈనెల 27న (ఆదివారం) కీసరలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు బోనాల ఉత్సావ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గ్రామ దేవతల ఆలయాలను, బంగారుమైసమ్మ దేవాలయంను బోనాల ఉత్సవాలకు సిద్ధం చేయడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్‌ తుడుం యాదగిరి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

పది మంది జూదరుల అరెస్ట్‌

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫాంహౌస్‌పై పోచారం పోలీసులు దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్ట్‌ చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం .. శుక్రవారం అందిన సమాచారం మేరకు కొర్రెములలోని ప్రతాపసింగారం రోడ్డులో ఉన్న పిల్లి నాగరాజు ఫాంహౌస్‌పై పోలీసులు దాడిచేసి, పేకాడుతున్న పది మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద లభించిన రూ. 67,630 నగదు, 5 సెల్‌ ఫోన్లు, 5 సెట్ల కార్డులు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లలో చెంగిచర్లకు చెందిన నోముల ప్రభాకర్‌రెడ్డి (36), బోడుప్పల్‌కు చెందిన రణదీప్‌రెడ్డి (40), కే.వీ.రెడ్డి (39), మారెడ్డి తిరుపతిరెడ్డి (39), పారుపల్లి రామ్‌రెడ్డి (38), ఉప్పల్‌లోని కెనరానగర్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి (37), మేడిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి (46), సరూర్‌నగర్‌కు చెందిన గడ్డం సత్యనారాయణ (56), పీర్జాదిగూడకు చెందిన రాపోలు రామ్‌రెడ్డి (49), ఉప్పల్‌లోని భరత్‌ నగర్‌కు చెందిన నాగరాజు (49) ఉన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు



కీసర: ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉస్మానియా విశ్వవిద్యాలయ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ జహంగీర్‌ అన్నారు. శుక్రవారం రాంపల్లిలోని కేజీఆర్‌ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు ఆర్థిక పారిశ్రామిక మార్పులను జాగ్రత్తగా గమనిస్తూ తమ పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకుంటేనే పోటీని తట్టుకొని నిలబడుతారన్నారు. కళాశాల చైర్మన్‌ గోవింద రెడ్డి, డైరెక్టర్‌ రమణారావు మాట్లాడుతూ.. కేజీఆర్‌ కళాశాలలో గల ప్రత్యేక విద్యా సౌకర్యాలను వివరించి ఎంబీఏ విద్యార్థులకు అమితమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ నితిన్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ విజయలక్ష్మీ, విజయకుమార్‌, సునిత, డా.వేణు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రతాపసింగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పాలకవర్గం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్‌ రైతు సేవా సహకార సంఘ చైర్మన్‌ రామ్‌రెడ్డి, డైరెక్టర్‌ రేసు లక్ష్మారెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, జిల్లా సివిల్‌ సప్‌లై మేనేజర్‌ సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల, నాయకులు బొక్కా ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రైతులు సుభాష్‌, అంజయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌: రైతులు పండించిన ధాన్యంను కొనుగోలు చేయడానికి మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌ సహకార సంఘంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం పాలకవర్గం, అధికారులు ప్రారంభించారు. ఏగ్రేడ్‌ ధాన్యంకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రూ.2320, కామన్‌ సన్నరకంకు 2300తో పాటు రాష్ట్ర ప్రభుత్వ బోనస్‌ రూ.500 కలిపి రూ.2800 చెల్లిస్తున్నట్లు సంఘం చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకట్‌రెడ్డి, సుగుణ, వైస్‌ చైర్మన్‌ శ్యాంలాల్‌, డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ పై కేసులు పెట్టడం సరికాదు

శామీర్‌పేట్‌: రాష్ట్ర ప్రభుత్వం రైడింగ్‌ల పేరిట ఆర్‌ఎంపీ పై దాడులకు పాల్పడుతూ కేసులు నమోదు చేయడం సరికాదని రాష్ట్ర ఆర్‌ఎంపీల జేఏసీ అధ్యక్షులు మల్లేశం అన్నారు. శుక్రవారం శామీర్‌పేట్‌ మండలంలోని అలియాబాద్‌లోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో రాష్ట్ర స్థాయి ఆర్‌ఎంపీల రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 50 వేలకు పైగా ఆర్‌ఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి డబ్ల్యూహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందజేయడానికి కృషి చేశారని తెలిపారు. డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ అకాల మరణంలో సర్టిఫికేట్ల కల నెరవేరలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వాన్ని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎంపీలపై దాడులు చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యల వలన ఆర్‌ఎంపీల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలను ఆపాలని, ఆర్‌ఎంపీల సమస్యలు, డిమాండ్లలను తీర్చాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


సమావేశంలో ఆర్‌ఎంపీలు

4న మున్సిపల్‌ షాపులకు వేలం

పోచారం: పురపాలక సంఘానికి చెందిన దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు వచ్చే నెల 4న మధ్యాహ్నం 12:30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్‌ వీరారెడ్డి తెలిపారు. రాజీవ్‌ గృహకల్పలోని 10 దుకాణాలు వేలానికి ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 2వ తేదీలోపు దరఖాస్తు కోసం రూ. 1000, డిపాజిట్‌ కింద రూ. 20 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అంబులెన్స్‌ ఆకస్మిక తనిఖీ


108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ షేక్‌ జాన్‌ షాహిద్‌

కీసర: కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న కీసర 108 అంబులెన్స్‌ వాహనాన్ని మేడ్చల్‌జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ షేక్‌ జాన్‌ షాహిద్‌ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న రికార్డ్స్‌ పరిశీలించడంతోపాటు కీసర మండల ప్రజలకు అందుతున్న అత్యవసర సేవల గురించి సిబ్బందిని ఆరా తీశారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ మందుల స్టాక్‌ రికార్డ్స్‌ను పరిశీలించారు.

పశుగణన ప్రారంభించిన కలెక్టర్‌ గౌతమ్‌



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పాడి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశు గణనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ప్రారంభించారు. నాలుగు నెలల పాటు తలపెట్టిన పశుగణన కార్యక్రమంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, కోళ్లతో సహా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి దేశ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను కచ్చితంగా గణన చేయడానికి మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 15 మండలాల్లో సంబంధిత అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బందితో పాటు గోపాల మిత్రులు, ఇతర ఔట్‌ సోర్సింగ్‌ సిబ్బంది కూడా ఈ గణనలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పక్కాగా పెంపుడు జంతువుల వివరాలు నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటికి వస్తారని, ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్‌ గౌతమ్‌ కోరారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. సుధాకర్‌, సహాయ సంచాలకుడు డా. ప్రభు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆసక్తి కలిగిన పార్టీలు, ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించాలని నిర్ణయించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఇందిర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్‌ 13 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్‌ కార్యాలయంలో వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను దాఖలు చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ బీసీ కమిషన్‌ సభ్యుల బృందం 7న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ జరుపుతుందన్నారు. ఇందులో బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌, సభ్యులు రాపోలు జయప్రకాష్‌, తిరుమలగిరి సురేందర్‌, బీసీ వెల్ఫేర్‌ కమిషనర్లతో కూడిన బృందం తదితరులు పాల్గొంటుందన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి..!

- చెత్త సేకరణలో ర్యాంకులు సాధించటంపై దృష్టి
- తడి, పొడి చెత్తను విడివిడిగా వేసేలా అవగాహన కార్యక్రమాలు
- ముందస్తు ప్రణాళికలతో అధికార యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్‌ ర్యాంకులు సాధించేందుకు నగర శివారు పురపాలక సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 60 నుంచి 70 శాతమే ఇస్తున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడవుతోంది. కొన్ని పురపాలక సంఘాల్లోనైతే అసలే పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పటం లేదని తెలుస్తోంది. ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకుల సాధించటంలో పలు పురపాలక సంఘాలు వెనుకబడిపోతున్నాయి. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా పుర అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదంతా డిసెంబరు వరకు కొనసాగనుంది.

డివిజన్లు/వార్డుల వారీగా ..

నగర శివారు మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలికల్లో 675 డివిజన్లు/ వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యేకంగా చూపించటంతో పాటు కరపత్రాలు, బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్‌ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పించనున్నారు. పరిసరాల శుభ్రతపై విద్యా సంస్థల్లో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మార్పు రావాలనే ఉద్దేశంతో...

స్వచ్ఛతకు వినియోగించే పురపాలిక వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఒకే డబ్బాలో చెత్త ఇవ్వకుండా అవగాహన కల్పించనున్నారు. అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటెడ్‌ కమ్యూనిటీ ఏరియాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రజల్లో విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా చెత్త సేకరణ విషయంలో మార్పు తీసుకురావాలని పురపాలక తగిన కార్యాచరణతో ముందుకు సాగేందుకు కసరత్తు చేస్తున్నారు.

మెరుగైన ర్యాంకు లక్ష్యంగా ..

స్వచ్ఛ సర్వేక్షణ్‌ లో ఈసారి అవార్డు వచ్చేలా పురపాలక సంఘాలు పోటీ పడుతున్నాయి. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించిన పురపాలికలు రాష్ట్ర స్థాయిలో పోటీ పడేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నాయి. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరుతున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుందన్న పట్టుదలతో ముందడుగుకు సిద్ధమవుతున్నారు.